www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 25 సెప్టెంబర్ 2023
5
అన్నమయ్య



నేడు యథావిధిగా స్పందన

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

యువతకు ఆదర్శం 'కొరటాల'

శతజయంతి సందర్భంగా రోగులకు బ్రెడ్లు , పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - రాయచోటి

సిపిఎం పొలిట్‌బ్యూరో మాజీ సభ్యులు కొరటాల సత్యనారాయణ నేటి యువతకు ఆదర్శనీయమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ. రామాంజులు పేర్కొన్నారు. శతజయంతి మాజీ పొలీస్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ కొరటాల శత జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో 50 రోగులకు, బాలింతలకు బ్రెడ్లు పండ్లు పంపిణీ చేశారు. ముందుగా ఆస్పత్రిలో కొరటాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కొరటాల సత్యనారాయణ భూస్వామ్య కుటుంబంలో పుట్టి విద్యార్థి దశలోనే ఉద్యమాలు నడిపారని చెప్పారు. అప్పట్లో విద్యార్థి సంఘం జిల్లా నాయకులైన ఎంబి, ఎంహెచ్, ఎల్‌బిజిల సాన్నిహిత్యంతో కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులై పేదల శ్రేయస్సుకై జీవితాన్ని త్యాగం చేసిన ధన్యజీవి అన్నారు. ఆయన రేపల్లె డివిజన్ పార్టీ కార్యదర్శిగా, జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యులుగా, పొలిట్‌బ్యూరో సభ్యులుగా అంచెలంచెలుగా ఎదిగిన ప్రజానాయకులని పేర్కొన్నారు. రేపల్లె ప్రాంతంలో చేనేత కార్మికుల సమస్యలపై నిరంతరం అలుపెరగని కృషి చేశారు అన్నారు. లంకభూముల సమస్యపై నిరంతరం పోరాటాలు నడిపి పేద ప్రజలను సొసైటీలుగా ఏర్పాటు చేసి భూస్వాముల అధీనంలో లంక భూములను పేదలు సాగుచేసుకునేందుకు అనేక పోరాటాల ద్వారా సుసాధ్యం చేశారని తెలిపారు. గుంటూరు జిల్లాలో రైతాంగ ఉద్యమ నాయకులుగా పేద రైతుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారు అన్నారు. సిపిఎంరామాపురం శాఖా కార్యదర్శి కె నాగబసిరెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రజలను సమీకరించి పోరాటాలు నడిపేవారు అన్నారు. విద్యార్థి, యువజన, మహిళా నాయకులతో సన్నిహితంగా మెలుగుతూ వారిని పోరాట పథంలో నడిపేందుకు కృషి చేశారన్నారు. కారక్రమంలో సిపిఎం నాయకులు మాధవయ్య, రెడ్డిశేఖర్, రమణ, ఆసుపత్రి సిబ్బంది రాజు, వెంకటరమణ, కొండయ్య, మాధవి పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** కొరటాల సత్యనారాయణ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్ అన్నారు. సత్యనారాయణ శత జయంతి సందర్భంగా ఆర్అండ్‌బి కార్యాలయంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నరసింహ సర్వేపల్లి, బి.శివయ్య, వెంకటేష్, ప్రభాకర్, ప్రసాద్ పాల్గొన్నారు.



రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



కొరటాల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

జిపిఎస్‌ను ఎట్టి పరిస్థితిలోనూ అంగీకరించం

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నాక్కా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిపిఎస్‌ను ఎట్టి పరిస్థితిలో అంగీకరించమని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, ప్యాప్టో రాష్ట్ర చైర్మన్ నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా అనంతపురం నుంచి బయలుదేరిన యుటిఎఫ్ రాష్ట్ర జాత కడప, రాయచోటి పీలేరు మీదుగా ఆదివారం మదనపల్లికి చేరుకుంది. స్థానిక యుటిఎఫ్ నాయకులు వారికి ఘన స్వాగతం పలుకుతూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం యుటిఎఫ్ కార్యాలయం వద్ద సీనియర్ నాయకులూ ఉత్తన్నచే జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ కనుగుణంగా సిపిఎస్ రద్దు చేయకుండా దాని స్థానంలో జిపిఎస్ తీసుకొచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయులకు భవిష్యత్‌కు గ్యారంటీ లేకుండా చేస్తున్నారని వాపోయారు. హామీ ఇవ్వని రాష్ట్రాలు చతిఘడ్, రాజస్థాన్, వెస్ట్ బెంగాల్ వంటి ఆరు రాష్ట్రాలు ఎన్నికల ముందు హామీ ఇవ్వకపోయినా సిపిఎస్ ని రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేశాయని చెప్పారు. మన రాష్ట్రంలో ఎన్నికల ముందు పాదయాత్రలో సిపిఎస్‌ను కచ్చితంగా రద్దు చేస్తామని పదేపదే హామీ ఇచ్చినా నేటి ముఖ్యమంత్రి జగన్ ఆ విషయాన్ని విస్మరించి జిపిఎస్ తీసుకురావడం ఉద్యోగులను మోసం చేయడమేనని వాపోయారు. బిజెపి పాలిత రాష్ట్రాలు ఏ ఒక్కటీ నూతన విద్యా విధానాన్ని అమలు చేయకపోగా రాష్ట్రంలో అగ మేఘాల మీద అమలు చేయడంతో లక్షలాది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రయివేట్‌కు తరలి వెళ్లారని తెలిపారు. ఈ విధానంతో ప్రాథమిక విద్య ప్రమాదంలో పడిందని, ఈ ప్రభుత్వం ఏర్పడి నప్పటీ నుంచి ఒక్క డిఎస్‌సి కూడా విడుదల చేయక పోవడంతో వేలాది నిరుద్యోగులు తీవ్ర వేదనలో ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు హరిప్రసాద్, జాబీర్, రవి ప్రకాష్ , హేమలత, పురం వెంకటరమణ, సుధాకర్ నాయుడు, భాస్కర్ రెడ్డి, డివిజన్ నాయకులు సుధాకర్, శ్రీనివాసులు, అంజాద్, నర్సిహం, హరి , సీనప్ప, పయని, రవీంద్ర, విజయ్, హస్సన్ , మునిరాజ, భానుమూర్తి పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాజంపేట అర్బన్ : యుటిఎఫ్ స్వర్ణోత్సవ ప్రారంభ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు ప్రతాప్, నరసింహారాజు, సుబ్బ నరసయ్య, ఎల్లయ్య, ప్రధానోపాధ్యాయులు గోపాలకృష్ణ తిరుపతి రోడ్డు లోపల విద్యుత్ ఉపకేంద్రం వద్ద యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ చంగల్ రాజు, సిఐటియు జిల్లా నాయకులు రవికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. యుటిఎఫ్ విద్యారంగ వికాసం, ఉపాధ్యాయుల సంక్షేమానికి ఎన్నో ఉద్యమాలు చేపట్టిందని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతోపాటు విద్యార్థుల హక్కులు, వారి చదువు కోసం నిరంతర పోరాటాలతో యుటిఎఫ్ అగ్రభాగాన నిలిచిందని అన్నారు. జాతీయ విద్యా విధానం రద్దు, పాత పెన్షన్ సాధన, రాష్ట్రంలో విద్యారంగ సంస్కరణలకు వ్యతిరేకంగా కార్యక్రమాలు రూపొందించుకొని పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం స్వర్ణోత్సవ వేడుకల గోడపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎఫ్ నాయకులు వెంకట సుబ్బయ్య, నాగేంద్ర, కవలకుంట్ల పాపయ్య, శ్రీనివాసులు, రమేష్, హరినాథ్, నరసింహారావు, వినోద్ కుమార్, సుధాకర్, సతీష్, నాగూర్ రవి, కృష్ణానందం, శివయ్య, రామకృష్ణ, రవిచంద్ర, కిషోర్ పాల్గొన్నారు.



మదనపపల్లెలో బైక్ జాతా నిర్వహిస్తున్న యుటిఎఫ్ నాయకులు



రాజంపేటలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

సామాజిక న్యాయం కోసం 29న మహాధర్నా



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వ్య.కాస. కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సామాజిక న్యాయం కోసం ఈ నెల 29 న విజయవాడలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం.జయరామయ్య, పందికాళ్ళ మణి, కెవిపిఎస్ మండల కార్యదర్శి నాగిపోగు పెంచలయ్యలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్ అండ్ బి కార్యాలయంలో మహా ధర్నాకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను పటిష్ఠంగా అమలు చేయాలని జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, అసైన్డ్ చట్ట సవరణ ఉపసంహరించుకోవాలని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో పరిపాలన అధ్వానంగా తయారైందని, దళితుల హక్కులు ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. అనేక సంవత్సరాలుగా దళితులు సామాజికన్యాయం కోసం రోడ్డెక్కుతున్నా వారికి న్యాయం జరగటంలేదని వాపోయారు. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో దాదాపు 45 సంఘాలు కలిసికట్టుగా ఏర్పడి దళితుల అభ్యున్నతి కోసం పనిచేస్తున్నాయని వారు తెలిపారు. దళిత, గిరిజనులకు 200యూనిట్లు ఉచిత విద్యుత్ ను 300యూనిట్లకు పెంచాలని, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను అమలు జరపాలని డిమాండ్ చేశారు. ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సర్వేపల్లి నరసింహ హాజరై మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బొజ్జ శివయ్య, సిఐటియు నాయకులు కె.వి రమణ, రైతు సంఘం జిల్లా నాయకులు సి.హరిప్రసాద్, నిర్మాణ సంఘం నాయకులు కే.చెన్నకేశవులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

మదనపల్లె అర్బన్ : కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడంలో భాగంగా కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర మీడియా చైర్మన్ ఎన్.తులసి రెడ్డి, ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ ముఖ్య అతిథులుగా విచేస్తారని, వీరికి మెట్రో కాంప్లెక్స్ నుంచి స్వాగతం పలుకుతామని చెప్పారు. సందర్భంగా జరిగే సమావేశంలో నూతనంగా పార్టీలో చేరే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం, నూతన కమిటీ సభ్యులకు అధినాయకులు పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేస్తారని ప్రకటించారు. మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు,పీలేరు నియోజకవర్గాలకు చెందిన నాయకులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న డివిజినల్ సహకార అధికారి ఎం. శ్యామ్‌ప్రకాశ్‌రెడ్డి

ఘనంగా కో- ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ వార్షిక మహాజన సభ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె కో- ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ 99వ వార్షిక మహాజన సభ సమావేశం ఆదివారం బ్యాంకు ప్రధాన కార్యాలయం నిర్వహించారు. సమావేశానికి బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జి, డివిజినల్ సహకార అధికారి ఎం. శ్యామ్ ప్రకాశ్ రెడ్డి అధ్యక్షత వహించారు. వార్షిక నివేదిక సమర్పించిన బ్యాంకు సిఇఒ పి. వి.ప్రసాద్ మాట్లాడుతూ, బ్యాంకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు డిపాజిట్లు రూ. 86కోట్ల 75 లక్షలుగా ఉన్నాయని, బ్యాంకు ఇచ్చిన అప్పులు రూ. 58 కోట్ల 70 లక్షలని తెలిపారు. అలాగే సభ్యుల షేర్ల ధనం రూ. 2కోట్ల 47 లక్షలు , బ్యాంకు వ్యాపార ధనవం రూ. 104 కోట్ల 89 లక్షలుగా ఉందని చెప్పారు. బ్యాంకు 99 ఏళ్లు పూర్తి చేసుకొని 100 సంవత్సరములోకి అడుగు పెట్టిందని తెలిపారు. బ్యాంకు ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 1కోటి 89 లక్షల 92 వేల స్థూల లాభం సంపాదించిందని తెలిపారు. బ్యాంకులో రుణాలు తీసుకొన్న ఖాతాదారులందరు క్రమం తప్పకుండా తమ నెలసరి కంతలు చెల్లించాలన్ని లేకపోతే త్వరిత గతినే చట్ట పరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు. సమావేశంలో మేనేజర్లు సుధారాణి, జయచంద్రనాయుడు, రవిచంద్ర రెడ్డి, రాధిక, రాజశేఖర్, సిబ్బంది పాల్గొనారు.



మాట్లాడుతున్న టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్

'స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల సందర్శనకు సిద్ధమా?'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల సందర్శనకు వైసిపి ప్రభుత్వం సిద్ధమా అని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ అన్నారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చంగల్ రాయుడు ఆధ్వర్యంలో మేము సైతం బాబు కోసం రిలే దీక్షలో భాగంగా టిఎన్ఎస్ఎఫ్ నాయకులు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ టిడిపి నాయకులు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను చూడటానికి వెళ్తున్న వారిని ఎందుకు అడ్డుకుంటున్నారని అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు నిర్వహిస్తున్న యూనివర్సిటీ, కలాశాల నిర్వాహకులను ఎందుకు బెదిరిస్తున్నారని ప్రశ్నించారు. కడపలో ఇడుపులపాయిలో ఉన్న ట్రిపుల్ ఐటి యూనివర్సిటీలో, రాజంపేటలో అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్‌కు సెంటర్ ఉందని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి టిడిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ కేంద్రాలు, 42 స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను పెట్టి దాదాపు 3 లక్షల మంది విద్యార్థులకు ట్రైనింగ్ ఇచ్చారని చెప్పారు. అందులో 75 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఎటువంటి అవినీతి జరగని స్కిల్ డెవలప్మెంట్ పథకంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని సిఐడి పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని అన్నారు. సమావేశంలో టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ ఉపాధ్యక్షులు మల్లికార్జున నాయుడు, నియోజకవర్గ ఉపాధ్యక్షులు సాయి ప్రసాద్, కంత్రి, నవీన్, సాయి, ప్రసాద్, శంకర్ రహీం, శివకేశవ, ప్రేమ్, చంద్రశేఖర్, భారీ స్థాయిలో విద్యార్థులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంగళ్లు కేసులో అరెస్టయిన టిడిపి కార్యకర్తలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

పుంగనూరు, అంగళ్ల అల్లర్ల కేసులో అరెస్టు అయిన 52 మందికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో వీరు ఆదివారం కడప సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. 60 రోజుల పాటు వీరు జైలో శిక్షణ అనుభవించారు. వీరికి టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాధవిరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, షాజహన్‌బాష స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గొడవల్లో లేకపోయినా అన్యాయంగా కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద నాయకులు పార్టీని వీడిపోయినా కార్యకర్తలు పార్టీని కాపాడుకుంటూ ఉన్నారని తెలిపారు. పార్టీలో కష్టపడేవారిపై కేసులు పెడుతున్నారని విమర్శించారు. అల్లర్ల ఘటనలో ఉన్నారా..లేరా అని విచారణ కూడా చేయకుండా కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.



సెంట్రల్ జైలు నుంచి విడుదలై వస్తున్న టిడిపి కార్యకర్తలు

రైతుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

జిల్లా ఉద్యానవన శాఖాధికారి పి.రవిచంద్రబాబు



ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో రైతులందరికీ అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించడమే తమ లక్ష్యమని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి పి.రవిచంద్రబాబు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో ఎలాంటి ఉద్యాన వన పంటలు సాగు చేయాలో, ఏ పంట వేస్తే లాభాలు, అధిక దిగుబడులు వస్తాయి వంటి వివరాలు ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలో ఉద్యానవన శాఖ కార్యాలయాల వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 9 ఉద్యానవన శాఖ కార్యాలయాలున్నాయి. రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, టి.సుండుపల్లె, రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, ములకలచెరువు ప్రాంతాలలో ఉద్యానవన శాఖ కార్యాలయాలున్నాయి.

జిల్లాలో ఉద్యానవన పంటలు సాగు విస్తీర్ణమెంత?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉద్యానవన పంటలు ఖరీఫ్‌లో 1,43,778 ఎకరాలలో సాగు విస్తీర్ణం ఉండగా,1,12,112 ఎకరాలలో రైతులు పంటలు సాగు చేశారు. రైతులకు ఇ-క్రాఫ్ నమోదు ప్రక్రియ కూడా పూర్తయింది.

ఏయే పంటలు ఎక్కువగా సాగు చేస్తున్నారు?

జిల్లా వ్యాప్తంగా ఉద్యానవన ఖరీఫ్‌లో 80 వేల ఎకరాలలో మామిడి, 3,200 ఎకరాల్లో టమోటా, 13 వేల ఎకరాలు అరటి, 16 వేల నిమ్మ, 2 వేల ఎకరాలు మిగిలిన కూరగాయల పంటలను రైతులు సాగు చేస్తున్నారు.

జిల్లాలో నర్సరీలు ఎన్ని ఉన్నాయి? ఏయేప్రాంతంలో ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా 436 నర్సరీలున్నాయి. మదనపల్లె, రాజంపేట, రైల్వే కోడూరు, రాయచోటి ప్రాంతంలో దేవపట్ల, పీలేరు ప్రాంతాలలో ఎక్కువగా ఉన్నాయి. నర్సరీల్లో మామిడి, బొప్పాయి, అరటి, టమోటా, ఇతర మొక్కలు అందుబాటులో ఉన్నాయి.

ఇతర రాష్ట్రాలకు ఏయే పంటలు ఎగుమతి చేస్తారు?

జిల్లా నుంచి మామిడి, అరటి, బొప్పాయి, వంటి పండ్లను ఎక్కువగా తమిళనాడు, చెన్నై, ముంబాయి పలు ప్రాంతాలకు ఎగుమతులు అవుతున్నాయి. రైతులు నాణ్యమైన పంటలను ఎగుమతి చేస్తే అధిక లాభాలు పొందవచ్చు.

అధిక దిగుబడి పొందాలింటే ఏయే జాగ్రత్తలు పాటించాలి?

రైతులు అధిక దిగుబడి కోసం శాస్త్రీయ పద్ధతి ద్వారా పంటలను సాగు చేయాలి. మంచి విత్తనాలను సేకరించుకోవాలి. పంటను ప్రతి ఏడాదీ మార్పుడి చేసుకోవాలి. కలుపు ముక్కలను తీసివేస్తూ జీవ నియంత్రణ పద్ధతులు పాటించాలి. ఉద్యానవన శాఖ అధికారులు సూచించిన మందులను వాడకం ద్వారా తెగళ్లు నియంత్ర నియంత్రించి అధిక లాభాలు పొందవచ్చు.

ఎకో టూరిజం అభివృద్ధికి అవకాశాలు

జిల్లా అటవీ శాఖ అధికారి పి.వి. సందీప్ రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని జిల్లా అటవీ శాఖ అధికారి పి.వి. సందీప్ రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ ముందస్తు వేడుకల్లో భాగంగా రాయలసీమ టూరిజం అండ్ కల్చర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు ఆధ్వర్యంలో ఇంటాక్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య సంస్థల సహకారంతో ఆదివారం స్థానిక గ్రాండ్ ఇన్‌హోటల్ సమావేశ మందిరంలో ఎకో టూరిజంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పి.వి. సందీప్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 37 శాతానికి పైగా అటవీ ప్రాంతాలున్నాయని అందులోని పలు ప్రాంతాలను ఎకో టూరిజం కింద అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. అలాంటి ప్రాంతాల్లో ప్లాస్టిక్ వస్తువుల వినియోగం ఇబ్బందిగా మారిందని పర్యావరణ పరిరక్షణకు జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ అధికారులు చేస్తున్న కృషి స్వచ్ఛంద సంస్థల సహకారం ఎంతైనా అవసరమన్నారు. ప్రొద్దుటూరులో పచ్చదనం అభివద్ధికి అక్కడి డాక్టర్లు ముందుకు వస్తున్నారని తెలిపారు. ఈ విషయంగా కలిసి వచ్చేందుకు సిద్ధమైన రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, ఇంటాక్, లయన్స్ క్లబ్ సంస్థల ప్రతినిధులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇంటాక్ చాప్టర్ కన్వీనర్ మానస లయన్ కె. చిన్నపరెడ్డి మాట్లాడుతూ నాడు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి, నేడు ఆయన కుమారుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జిల్లా పర్యాటక అభివద్ధి చేస్తున్న కృషికి సహకారం అందివ్వడం మన బాధ్యత అన్నారు. ఇందులో పుష్పగిరి, పాలకొండలు, గువ్వల చెరువు, తదితర అటవీ ప్రాంతాలను ఎకో టూరిజం క్రింద అభివద్ధి చేసుకోవచ్చని తెలిపారు. జిఎస్టి అసిస్టెంట్ కమిషనర్ మోరంరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, ఇంజనీర్ దేసు వెంకట రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పర్యాటకంగా అభివద్ధి చేయడంలో స్వచ్ఛంద సంస్థలు కలిసి రావడం అభినందనీయం అన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు పోతుల వెంకటరామిరెడ్డి, పద్మప్రియ చంద్రారెడ్డి మాట్లాడుతూ బలమైన ప్రదేశాలను గుర్తించి అభివద్ధి చేయాలన్నారు. జిల్లా పర్యాటక అభివద్ధి సంస్థ సభ్యులు డా. వెల్లాల వెంకటేశ్వ రాచారి, ఇంటాక్ సభ్యులు భారవిలు మాట్లాడుతూ పుష్పగిరి గుట్టను పర్యాటకంగా అభివద్ధి చేయడం గురించి పరిశీలించాలన్నారు. పర్యాటక అభిమానులు సురేష్, నాగవేణి, మునికుమార్, పాండా ట్రావెలింగ్ ఏజెన్సీ ప్రతినిధి సయ్యద్, గంగాధర్, వెంకటేష్, చిన్నరాయుడు, ముకుంద రెడ్డి, కష్ణా రెడ్డి, రమణారెడ్డి, నారాయణ రాజు, సంజీవ రెడ్డి, సుబోధ్ రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన 'శ్రీసాయి' విద్యార్థులు

ప్రజాశక్తి - రాయచోటి



స్థానిక మాసాపేట శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల ఎంబిఎ విద్యార్థులు 2 సంవత్సరం 4 సెమిస్టర్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచి అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించారని శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తేజస్విని 91 శాతంతో మొదటి ర్యాంకు, నవీమ్ 90.5 శాతంతో రెండవ ర్యాంకు , శివ లీల 90 శాతంతో మూడో ర్యాంకు సాధించారని తెలియజేశారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను, ఫలితాల సాధనలో భాగమైన అధ్యాపకులను అభినందిస్తూ, ప్రతి ఒక్కరికీఉద్యోగ ఉపాధి భరోసా కల్పించడానికి మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి విద్యార్థీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని అంకితభావంతో కృషి చేయాలని, క్రమశిక్షణతో ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. బాలాజీ, ఎంబిఎ విభాగాధిపతి కొత్తపల్లి ఇంతియాజ్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులను అభినందించారు.

డిసెంబర్‌లో రచయితల సంఘం మహాసభలు

కడప అర్బన్ : జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 23,24 తేదీల్లో మహాసభలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి రోజు ప్రాచీన సాహిత్యం, కవిత, కథానిక, నవల, నాటకం ప్రక్రియలపై సదస్సులు ఉంటాయని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భువన విజయం నాటక ప్రదర్శన, రెండవరోజు అవధానం, హాస్యావదానం, కవిసమ్మేళనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సీనియర్ సాహితీవేత్తలు డాక్టర్ హనుమంతరావు, సుబ్రహ్మణ్యను సభ్యులు సత్కరించారు.



వాటర్ షెడ్ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్, సింగిల్‌విండో అధ్యక్షులు

వాటర్‌షెడ్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని బి.ఎర్రగుడి గ్రామపంచాయతీ రూ.1.40 కోట్ల నిధులతో పుటకారువండ్లపల్లి కాలనీ వద్ద వాటర్‌షెడ్ నిర్మాణ పనులకు సర్పంచ్ చెంచర్లపల్లి రెడ్డయ్య, లక్కిరెడ్డిపల్లి సింగిల్ విండో అధ్యక్షులు నెరుసుపల్లి ఎర్రంరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి చొరవతో వాటర్‌షెడ్ నిర్మాణానికి నిధులను మంజూరు చేయించారని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్క రైతుకు మేలు జరిగే విధంగా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వాటర్ షెడ్ జై నరసింహారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ దామోదర్ రెడ్డి, కమిటీ సభ్యులు దక్షిణపు లక్ష్మీనారాయణ లోమడ జగన్మోహన్‌రెడ్డి, వల్లపు మల్లేష్, కొర్లకుంట ఓబులేసు, కోటే చలపతినాయుడు, బండి రమణయ్య, ప్రసాద్ బాబు, తోపురెడ్డి, శివారెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ పరిధిలో ప్రజలు ఇంటి పన్నులు, దుకాణ లైసెన్స్ పన్నులు సకాలంలో చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని నగర పంచాయతీ కమిషనర్ మనోహర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పనున్నలుచెలించి నగర పంచాయతీలో ఆన్‌లైన్ రశీదు తీసుకోవాలని సూచించారు.

చిదానందగౌడ్ మృతి బాధాకరం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి చిదానందగౌడ్ మృతి బాధకరమని ఎమ్మెల్యే మేడా వెంకట మల్లిఖార్జునరెడ్డి అన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ తిరుపతిలో తుదిశ్వాస విడిచారు. ఆదివారం ఎమ్మెల్యే చిదానంద్‌గౌడ్ మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ బిసి అభివృద్ధికి అహర్నిశలు పాటుపడి తుది శ్వాస వరకు అలుపెరగని పోరాటం చేసిన గొప్ప వ్యక్తని కొనియాడారు. కార్యక్రమంలో వైసిపి రాజంపేట పట్టణ అధ్యక్షులు కృష్ణారావు, మండల జెసిఎస్ కన్వీనర్ గంగిరెడ్డి, చంద్రమౌళి, ప్రభుత్వ ఆస్పత్రి డైరెక్టర్లు హస్తవరం ఉమామహేశ్వర్ రెడ్డి, వడ్డే శ్రీను, జిల్లా ప్రధానకార్యదర్శి సయ్యద్‌అమీర్, మనుబోలు వెంకట సుబ్బయ్య, రామసామిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, మురళిఆచారి, రాజేష్ ఆచారి, హిమగిరియాదవ్, కాజా మొహిద్దిన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పఠాన్ మహమ్మద్ అలీఖాన్

మోడీ రాజ్యాంగ నేరాలకు పాల్పడ్డం తగదు : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప

దేశ చరిత్రలో ఇప్పటివరకు ఏ ప్రధానమంత్రి కూడా చేయని రాజద్రోహం, భారత రాజ్యాంగ నేరాలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాల్పడినట్లు కాంగ్రెస్ కమిటీ మైనార్టీ ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్‌అలీఖాన్ ఆరోపించారు. ఆదివారం ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు ప్రధాని నరేంద్రమోడీ భారత రాజ్యాంగ పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. రాజ్యాంగ పుస్తకాల్లోని పీఠికలో సోషలిస్టు, సెక్యులరిజం అనే ప్రధానమైన రాజ్యాంగ భాగాలను తొలగించి భారత రాజ్యాంగం ప్రతులను పార్ల మెంటు సభ్యులకు అందజేయడం ద్వారా నరేంద్రమోడీ రాజ్యాంగ నేరం, జాతీయస్థాయి నేరానికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. యదేచ్ఛగా రాజద్రోహం, రాజ్యాంగ నేరాలకు పాల్పడుతున్నందున వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో బిజెపి పార్టీకి ప్రజలు తగిన రీతిలో గుణపాఠం నేర్పుతారని విమర్శించారు. సమావేశంలో నాయకులు నూకల చిన్నకులాయప్ప, మాజీ కార్పోరేటర్ ఎం.రహమతుల్లా పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

నూతన కార్యవర్గం ఎన్నిక

కడప : కమలాపురం నియోజకవర్గంలోని వీరపునాయినిపల్లి మండలం తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక ఆదివారం ఎర్రగుంట్లలోని జడ్‌పి ఉన్నత పాఠశాలలో తొగట వీరక్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బండారు సూర్యనారాయణ అధ్యక్షతన జరిగింది. నూతన కమిటీ అధ్యక్షులుగా బండారు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా గుజ్జల ప్రవీణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పల్లా గండి ఆంజనేయులు, కోశాధి కారిగా ఉలసాల అన్నయ్య, గౌరవాధ్యక్షులుగా వెలిగండ్ల ఎద్దుల కొండ్రాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బండారు శ్రీనివాసులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ కమిటీకి ఎన్నికైన వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు బండారు సూర్యనారాయణ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కళ్యా సుధాకర్, ప్రధాన కార్యదర్శి బండా శంకర్, జిల్లా కోశాధికారి కుండా భాస్కర్, జాతీయ ఉపాధ్యక్షులు బండారు రఘురామయ్య, కమలాపురం ప్రధాన కార్యదర్శి పల్లా నాగేశ్వరరావు, వేంపల్లి గౌరవాధ్యక్షులు కొరముట్ల సుబ్బరాయుడు, ఎర్రగుంట్ల చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీ అధ్యక్షులు కోనేటి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి బడి గించల భీమయ్య, ఎర్రగుంట్ల మాజీ అధ్యక్షులు ఉప్పు ఈశ్వరయ్య, కడప నగర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా నరసింహారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు వెలిగండ్ల సీతారామయ్య, గంజికుంట రంగయ్య పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

మండలంలోని దమ్మనపల్లె గ్రామంలో జనసేన పార్టీ నాయకులు శీలంశెట్టి లక్షుమయ్య, వీర మహిళ విజయలక్ష్మి చేతుల మీదుగా జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం కిట్లను సభ్యులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దూర దృష్టితో పార్టీ సభ్యత్వం కిట్లను పంపిణీ చేయడంఎంతో సంతోషం అన్నారు. సభ్యత్వం తీసుకున్న సభ్యులకు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5లక్షల బీమా అందించి భరోసా ఇస్తున్నట్లు తెలిపారు. జనసేన పార్టీ బలోపేతానికి క్రియాశీలక సభ్యులు చేస్తున్న కృషిని పార్టీ గుర్తించి గౌరవిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాగితాల్లోనే ప్లాస్టిక్ నిషేధం..!

టాస్క్‌ఫోర్స్ పేరిట హడావుడి.. ఆచరణలో అంతంత మాత్రమే

ప్రజాశక్తి - జమ్మలమడుగు



ప్లాస్టిక్ కవర్లలో తీసుకెళుతున్న కూరగాయలు



రహదారులపై వాడిపడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

పర్యావరణానికి హానికరంగా మారిన ప్లాస్టిక్ కవర్లు, ఒక్కసారి వాడే (సింగిల్ యూజ్) ప్లాస్టిక్‌ను గత ఏడాది నుండి కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని ఆదేశించింది. కాగా జమ్మలమడుగు పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం కాగితాలల్లోనే కనిపిస్తుంది. అమలు పకడ్బందీగా జరుగుతోందని అధికారులు చెబుతున్నప్పటికీ, బహిరంగంగా మున్సిపల్ అధికారుల ఎదుటే విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం జరుగుతున్నప్పటికీ చర్యలు తీసుకోవడంలేదు. పట్టణంలోని ప్రధాన వాణిజ్య కూడలల్లో ప్లాస్టిక్ అమ్మకాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయనే ఆరోపణలున్నాయి. గతేడాది టాస్క్‌ఫోర్స్ పేరుతో హడావుడి చేసిన అధికారులు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై అపరాధ రుసుం విధించారు. తర్వాత పర్యవేక్షణను గాలికి వదిలేశారు. మరోవైపు ప్రజా ఆరోగ్య, పారిశుధ్య విభాగం సిబ్బంది ఎక్కడైనా ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తే ఆయా దుకాణాదారులు వ్యాపారులకు లోపాయికారికంగా సహకరిస్తూ అందిన కాడికి దండుకుని జేబులు నింపుకొని వదిలేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. టాస్క్‌ఫోర్స్ పేరిట ఏర్పాటు చేసిన బృందం అపరాధ రుసుంగా వసూలు చేసిన మొత్తం మున్సిపాలిటీ ఖజానాకు ఎంత జమ చేశారనే వివరాలు ప్రజలకు ఇంతవరకు తెలపడం లేదు. ఇప్పటికీ నిషేధిత పాలిథీన్ కవర్లు తోపుడుబండ్లపై, హోటళ్ళు, కూరగాయలు, పండ్ల వ్యాపారులు వద్ద, పాలు, పెరుగు విక్రయ దుకాణాల్లో కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల 121 మైక్రానుల కంటే ఎక్కువ మందం ఉన్నట్లు ముద్రించిన కవర్లు కనిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి పకడ్బందీగా చర్యలు తీసుకోకుంటే నిషేధిత లక్ష్యాలు నీరు గారుతుందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విచ్చలవిడి వినియోగం : జమ్మలమడుగు పట్టణంలో ఒక్కసారి వాడి పడేసే ప్లాస్టిక్ విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. కొబ్బరిబొండాల దుకాణాల వద్ద పల్చని ప్లాస్టిక్ బాటిళ్లు, కొన్ని హోటళ్లల్లో అల్పాహారం స్టాల్స్ వద్ద ప్లాస్టిక్ స్పూన్లు, పోర్కులు, గ్లాసులు వాడుతున్నారు. మార్కెట్లోని పలు దుకాణాలలో వీటిని అమ్ముతుండడంతో వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. నిషేధిత వస్తువులు విక్రయించే దుకాణాలపై అధికారులు కఠినంగా వ్యవహరించడం లేదనే విమర్శలున్నాయి. ప్రజా ఆరోగ్య విభాగానికి సిబ్బంది ప్రస్తుతం భారీగా ఉన్నందున ఒకటి, రెండు నెలలు కాకుండా నిబంధనలు అమలు పక్కాగా చేపట్టాల్సిన అవసరం ఉంది. వార్డు సచివాలయంలో పర్యావరణ కార్యదర్శులు అందుబాటులో ఉన్నారు. మీరు కాకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్వైజర్లు పక్కాగా దృష్టి సారించి నిబంధనలు, అమలు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ప్లాస్టిక్ నిషేధం ఏమంత కష్టం కాదని కొన్ని పట్టణ పురపాలక సం స్థలలో ఇప్పటికే నిరూపించిన విషయం తెలిసిందే.

కఠిన చర్యలు లేకపోవడంతోనే : ప్రత్యేక సందర్భాల్లో రకరకాల కార్యక్రమాలతో హడావుడి చేసే అధికారులు, ప్రజాప్రతినిధులు మామూలు రోజులలో పర్యావరణ పరిరక్షణపై గట్టి దృష్టి సారించడం లేదు. పట్టణంలోని మెయిన్ బజార్, తాడపత్రి రోడ్డు, ముద్దనూరు రోడ్డు, ప్రొద్దుటూరు రోడ్డు, మార్కెట్ రోడ్డు వంటి ప్రధాన కూడళ్లల్లో ప్లాస్టిక్ వస్తువుల వినియోగం ఎక్కువగా కనిపిస్తుంది. సింగిల్ యూజ్ బాటిళ్లు విక్రయించే దుకాణాలు పట్టణంలో చాలా ఉన్నాయి. వీటి అన్నిటిపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు.



జలమయమైన రోడ్డును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అభివృద్ధి అంటే ఇదేనా?

ప్రజాశక్తి - కడప

చిన్నపాటి వర్షానికే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సొంత జిల్లా అయిన కడపలో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని, నివాస గృహ సముదాయాలు జలమయమయ్యాయి. ఇదేనా సీఎం సొంత జిల్లాలో అభివృద్ధి అంటే అని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నంది మండలం విజయ్ సుశీల్ కుమార్ అన్నారు. వైసిపి జిల్లా కడప పట్టణంలోని 40 డివిజన్ ఎస్‌బిఐ కాలనీ, మరియాపురంలో శనివారం రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికె డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకుండా పోవడం వల్ల ఆ నీరంతా రోడ్లపైకి చేరి చెరువులను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, సమస్యలు పరిష్కరించుకుంటే రాబోవు రోజుల్లో తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో బాస్కో, మధు, పుత్తూరు రాజు, షబ్బు పాల్గొన్నారు.

ఆయుర్వేదిక్ హెర్బల్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి- పోరుమామిళ్ల టౌన్

పట్టణంలోని గాయత్రినగర్‌లో ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హెర్బల్ స్టోర్‌ను నిర్వహకులు బైరిశెట్టి శ్రీనివాసులు, అశోక్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆయుర్వేదంపైనా అవగాహన కల్పిస్తున్నామన్నారు.ఆయుర్వేద ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతోనే హెర్బల్‌స్టోర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఆయుర్వేద వైద్య నిపుణులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి ఆరోగ్య సమస్యలకు సలహాలు, సూచనలు అందిం చారు. కార్యక్రమంలో రమణారెడ్డి పాల్గొన్నారు.

సామాజిక అంశాలకు అద్దంపట్టేవి 'కైఫియత్తులు'

ప్రజాశక్తి - కడప అర్బన్

రెండు శతాబ్దాల నాటి కడప జిల్లా గ్రామాల్లో నివసించే వ్యక్తుల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, విశ్వాసాలు, పండే పంటలు, బావులు, చెరువులు వంటి అనేక సామాజిక అంశాలకు అద్దపట్టేవి మెకంజి కైఫియత్తులు అని తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎం.లక్ష్మయ్య పేర్కొన్నారు. ఆదివారం సి.పి.బ్రౌన్ భాషా పరోధన కేంద్ర నిర్వహిస్తున్న నెలనెలా సీమ సాహిత్యంలో భాగంగా 124వ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్నల్ కాలిన్ మెకంజీ ఆంగ్లేయ అధికారి హోదాలో మద్రాసు ప్రావిన్స్ సర్వేయర్ జనరల్‌గా పనిచేసినప్పుడు దాక్షినాత్య ప్రదేశాల స్థానిక చరిత్రలను ఆయా గ్రామ కరణాల చేత రాయించి కైఫియత్తులు పేరుతో భద్రపరచారని పేర్కొన్నారు. కడప జిల్లా కైఫియత్తులను 1810 నుంచి 1812 మధ్య ప్రాంతంలో రాయించినట్లు ఆధారాలున్నాయని చెప్పారు. మెకంజీ మరణానంతరం 40 ఏళ్లకు మద్రాసు ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీలో శిథిలావస్థలో ఉన్న కైఫియత్తులకు సి.పి.బ్రౌన్ శుద్ధప్రతులు తయారు చేయించారని తెలిపారు. కార్యక్రమంలో వైవీయూ పాలకమండలి సభ్యులు మూల మాల్లికార్జునరెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సిబ్బంది రమేష్‌రావు, వెంకటరమణ, మౌనిక, హరిభూషనరావు, రామాంజనేయులు, రాజారెడ్డి, రామమోహన్‌రెడ్డి ఎం.సురేష్, గురివిరెడ్డి, శ్యామసుందర్‌రెడ్డి, అశోక్‌రాజు, చంద్ర, శివ, అసిఫ్‌ఖాన్, కుమార్, నరసింహమూర్తి, గంగయ్య, కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ పాల్గొన్నారు.

ఇడుపులపాయ అడవుల్లో చిరుత సంచారం

వేంపల్లె : మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి సమీపంలో శనివారం రాత్రి చిరుతపులి సంచరించి వెళ్లినట్లు హరిత రెస్టారెంట్ సిబ్బంది ఫారెస్ట్ అధి కారులకు సమాచారమిచ్చారు. స్పందించిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బాలసుబ్రమణ్యం తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలం వద్దకు వెళ్లి చిరుతపులి తిరి గిన ఆనవాళ్లపై ఆరా తీశారు. చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశీలించి ట్రిపుల్ ఐటిలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులకు సూచనలిచ్చారు. రాత్రి సమయంలో డ్యూటీ చేస్తున్న సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని కోరారు. సమీపంలోని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని బాలసుబ్రమణ్యం సూచించారు. ఇడుపులపాయ ప్రాంతంలో దట్టమైన శేషాచల అడవులు ఉండడంతో అడవి జంతువులు అప్పుడప్పుడు కనపడేవి. ప్రస్తుతం చిరుతపులి కనపడడంతో ఆ ప్రాంతంలోని ప్రజలు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

రాజధాని తరలింపు రాయలసీమకు తీరని ద్రోహం

పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

వేంపల్లె : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నుండి విశాఖకు తరలిస్తే రాయలసీమ ప్రజలకు తీరని నష్టంతోపాటు ద్రోహం చేసిన వారుగా వైసిపి ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ ప్రజలకు శాశ్వత నష్టం, అన్యాయం జరుగు తుందన్నారు. రాయలసీమ ప్రజలు రాజధాని అమరావతికి పోవాలంటే దాదాపు 10 గంటలు పడుతుంది.. అదే విశాఖకు పోవాలంటే మరో 10 గంటలు అదనంగా పడుతుందని చెప్పా రు. అనేక వ్యయ ప్రాయాసాలకు గురికావాల్సి వస్తుందన్నారు. అమ రావతి రాష్ట్రానికి నడి బోడ్డున ఉంద న్నారు. అన్ని ప్రాంతాల వారికి సౌకర్యంగా ఉందని తెలిపారు. సచివాలయ భవనాలు కూడా పూర్తయ్యాయని తెలిపారు. దాదాపు రూ.10 వేల కోట్లు ప్రజాధనం ఖర్చు చేశారన్నారు. ఈ నేపథ్యంలో రాజధాని మార్పు నిర్ణయం సరికాదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రాయల సీమ వాసిగా ఉంటూ రాయలసీమ ప్రజలకు ద్రోహం చేయడం దురదృష్ట కరమన్నారు. తప్పు చేయడం మానవ సహజమని, సరిదిద్దు కోవడం విజ్ఞుల లక్షణమన్నారు. రాజధాని మార్పు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని తులసిరెడ్డి కోరారు.

రచయిత బొమ్మిశెట్టికి సన్మానం

చాపాడు : మైదుకూరు పట్టణానికి చెందిన 'వన్నూరమ్మ' ఎదురులేని పాలెగత్తె పుస్తక రచయిత బొమ్మిశెట్టి రమేష్‌ను అనంతపురం పట్రా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రుద్రంపేట యాదవ కళ్యాణమండపంలో ఘనంగా సన్మానించారు. అనంతపురం పట్రా కులస్తుల సమ్మేళనం-భవిష్యత్తు కార్యాచరణ జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఎదురులేని పాలెగత్తె పుస్తకం అత్యంత ప్రజాదరణ పొందిందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కూడా వన్నూరమ్మ ఎవరు అని ఇంటర్నెట్లో వెతుకుతున్నారని రచయిత తెలిపారు. సన్మాన కార్యక్రమంలో పట్రా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపోతు హనుమంత నాయుడు, సలహాదారుడు పెద్దపోతు ఆంజనేయులు, బ్రహ్మంగారిమఠం వైస్ ఎంపిపి రాజశేఖర్ నాయుడు, ఎంబిసి డైరెక్టర్ నాయిని రమేష్ నాయుడు, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఆర్గనైజర్ తలుపుల శ్రీనివాస నాయుడు, హైదరాబాద్ మంచాల వెంకటేష్, నాగార్జున పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుడి నిమజ్జనం



బి.కొత్తకోట : వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణ పరిధిలోని పోకనాటి వీధి శ్రీరాముని దేవస్థానం దగ్గర గణేశ విగ్రహానికి ఏడు రోజులు పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక కమిటీ, ధర్మకర్తలు ఆధ్వర్యంలో ఉభయదారుల సహకారంతో ప్రతిరోజూ విశేష అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నిత్య పూజలందుకున్న గణపయ్యను ఆదివారం కేరళ నుంచి వచ్చిన కళాకారులతో ప్రత్యేక మేళ తాళాలు, భజనలు నడుమ కోలాహలంగా వినాయకుడు విగ్రహాన్ని ఊరేగించారు. ముందుగా ప్రత్యేక పూజలు చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు. అనంతరం భక్తి శ్రద్దలతో,"కరళ నుంచి వచ్చిన కళాకారులతో మేళ తాళాలతో బాణా సంచా పేలుస్తూ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. గణపతికి సమర్పించిన లడ్డూను వేలంపాట ద్వారా గుంతూరు వెంకటరమణ రూ.21 వేలకు దక్కించుకున్నారు. **చిట్వేలి:** మండల పరిధిలోని చిట్వేలి సత్యమ్మ తల్లి యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన బొజ్జ గణపయ్య నిమజ్జనం సందర్భంగా ఆనందల రవికుమార్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉట్టి కార్యక్రమాన్ని అందరూ కలిసి కనుల విందుగా నిర్వహించారు.కుల మతాలకతీతంగా లడ్డూ వేలం పాటలో షేక్ జాబిద్ రూ32వేలకు లడ్డూను కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జరిగే వినాయకచవితి ఉత్సవాలు కులమతాలకు అతీతంగా నిర్వహించుకోవడం ఆనందదాయకమన్నారు. **రాయచోటి :** అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని మాజీ జడ్‌పి చైర్మన్ సుగువాసి బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు.ఆదివారం పట్టణంలోని సరస్వతినగర్‌లో మన్నూరు చంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద కొండేటి సహదేవ కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాలసుబ్రమన్యం హాజరయ్యారు. ఆలయకమిటీ సభ్యులు ఆయనను గజమాల, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ వారు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. సుగవాసి బాలసుబ్రమణ్యం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. కార్య క్రమంలో రామాంజులు, నాగార్జున, మహేందర్, సురేంద్ర, లోకేష్ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** మండలంలోని కొండమారిపల్లి పంచాయతీ టిఎన్ ఆర్ కాలనీ కుంటలో టిఎన్‌ఆర్ కాలనీ యూత్ ఏర్పాటు చేసిన గణేశుడి నిమజ్జనం వైభవంగా జరిగింది.పురవీధుల్లో వినాయకున్ని ఊరేగింపు చేశారు. లడ్డూల వేలం పాటలో కాలనీకి చెందిన శ్రీనివాలు రూ.7100, శ్రీకాంత్ రూ.7వేలకు సొంతం చేసు కున్నారు. ప్రజలకు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ప్రజలు, యువకులు పాల్గొన్నారు.



చిట్వేలి : వేలంలో లడ్డూను దక్కించుకున్న షేక్ జాబిద్



ఆర్థికసాయం అందిస్తున్న సాయివికాస్‌రెడ్డి

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రైల్వే కోడూరు

మండలంలో కె.బుడుగుంటపల్లి దళితవాడకు చెందిన ప్రణీత్‌కుమార్ కుటుంబం ఆర్థిక ఇబ్బందులను గుర్తించి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ తరుపున ఆర్థిక సాయం అందించారు. యువనాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి చేతులు మీదుగా ప్రణీత్‌కుమార్‌కు రూ.30వేలు ఆర్థిక సాయం అందించారు. నిరుపేద కుటుంబానికి సాయం చేయడం పట్ల గ్రామంల పెద్దలు, మహిళలు, యువకులు సాయివికాస్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ముక్కావారి పల్లి సర్పంచ్ ఆరవ శ్రీధర్, కె.బుడుగుంట పల్లి వార్డ్ నెంబర్ బీదం ప్రవీణ్‌కుమార్, సాలవ రమణరాజు సౌడవరం శివయ్య, బీదం శివకుమార్, సౌడవరం సిద్దేశ్వరా, మట్టం శివయ్య పాల్గొన్నారు.



జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ముగిసిన జిల్లా స్థాయి క్రీడా ఎంపికలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో ఆదివారం ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-19 బాల బాలికల సాఫ్ట్‌బాల్, క్రికెట్, బేస్ బాల్ సెలక్షన్స్ ఎస్‌జిఎఫ్ అండర్-19 సెక్రటరి సి. శారద, పీడీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లాస్థాయి ఎంపికలో గెలుపొందిన క్రీడాకారులు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని జిల్లాస్థాయి సెక్రటరీ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు చంద్రమోహన్‌రాజు జిజె సి కడప, కె.నాగేశ్వర్ రెడ్డి, మండలాల పిఇటిలు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కథల పోటీలు

ప్రజాశక్తి- పోరుమామిళ్ల టౌన్

పోరుమామిళ్ల లోని గ్రంథాలయంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు ఖాసీం వల్లి, గ్రంథాలయాధికారి ఆఫ్రిది ఆధ్వర్యంలో విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించారు. ఈ కథల పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకొన్నారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా కార్యవర్గ సభ్యులు ఖాసీంవల్లి మాట్లాడుతూ ప్రతి ఆదివారం విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి అందుబాటులో ఉన్న పుస్తకాలను చదివి విజ్ఞాన వంతులు కావాలన్నారు. నేడు నిర్వహించిన కథల పోటీలలో విజేతలతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు అందజేస్తానన్నారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ మాట్లాడుతూ విద్యార్థులను గ్రంథాలయానికి రప్పించడానికి ప్రతి ఆదివారం పాటలు, పద్యాలు, జాతీయ నాయకుల చరిత్రలు, దేశభక్తి గీతాలు, తదితర అంశాలపై పోటీలు నిర్వహించి దాతల సహకారంతో బహుమతులు అందిస్తామన్నారు. ఈ వారం ఖాసీంవల్లి ముందుకు వచ్చి బహుమతులు అందజేస్తామనడం హర్షణీయమని చెప్పారు. కార్యక్రమంలో పాఠకులు రంగనాయకులు,అధ్యాపకులు మహమ్మద్ రఫీ,విద్యార్థులు పాల్గొన్నారు.

బొల్లు రామ్మోహన్‌కు అరుదైన గౌరవం

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

హిందీ సాహిత్య భారతి తెలంగాణ నిర్వహించిన వార్షికోత్సవంలో పోరుమామిళ్లకు చెందిన బొల్లు రామ్మోహన్‌కు అరుదైన గౌరవం లభించింది. కార్యక్రమం కేంద్రీయ హిందీ సంస్థాన్ హైదరాబాదులో నిర్వహించారు. ఉత్తరప్రదేశ్ మాజీ విద్యా శాఖ మంత్రి డాక్టర్ రవీంద్ర శుక్లా రామ్మోహన్ చేసిన కవితా గానం మెచ్చి బహుమానం అందజేశారు. రామ్మోహన్‌కు అరుదైన గౌరవం లభించడంపై పట్టణంలోని విద్యావేత్తలు, సాహితీ వేతలు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కవులు, రచయితలు డాక్టర్ సురబిదత్, డాక్టర్ మాణిక్యాంబ, డాక్టర్ అహేల్యా మిశ్రాజి, శ్యామ సుందరన్ ,కేంద్రీయ హిందీ సంస్థాన్ డాక్టర్ గంగాధర్ వానోడా డాక్టర్ దీపక్ దీక్షిత్ పాల్గొన్నారు.

చెన్నూరులో అత్యధిక వర్షపాతం నమోదు

ప్రజాశక్తి - కడప

చెన్నూరు మండలంలో అత్యధికంగా 168.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. కడపలో 98.2, కమలాపురంలో 32.8, వల్లూరులో 80.4, చింతకొమ్మదిన్నె మండలంలో 90.2, పెండ్లిమర్రిలో 83.4, కాజీపేటలో 92.6, ఒంటిమిట్టలో 10.8, సిద్ధవటంలో 160.8, బద్వేలులో 25.2, బీ మఠంలో 43.8, శ్రీ కాశినాయన మండలంలో 12.8, కలసపాడులో 5.4, పోరుమామిళ్లలో 21.2, బి. కోడూరులో 32.2, గోపవరంలో 20.8, అట్లూరులో 5.2, ఎస్ మైదుకూరులో 40.0, జమ్మలమడుగులో 4.2, కొండాపురంలో 0.4, పెద్దముడియం లో 4.0, రాజుపాలెంలో 8.2, ప్రొద్దుటూరులో 4.2, చాపాడులో 10.2, దువ్వూరులో 29.8, ఎర్రగుంట్లలో 3.0, పులివెందులలో 9.8, సింహాద్రిపురం లో 8.8, లింగాలలో 59.2, వేములలో 18.2, తొండూరులో 5.4, వివన్ పల్లి లో 26.8, వేంపల్లి లో 50.6, చక్రాయపేటలో 73.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. జిల్లా వ్యాప్తంగా సగటున 37.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-చెన్నూరు

ఎంపిఎస్‌ఎస్‌ఎస్ డైరెక్టర్ రెవ ఫాదర్ తలారి బాలరాజు ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌సిఎం చర్చి ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని కడప మేత్రాసన కోశాధికారి రెవ ఫాదర్ పెండ్లికట్ల దేవదాస్ పేర్కొన్నారు. కడప అపోస్తులిక పాలన అధికారి మోస్ట్ రెవ బిషప్ డాక్టర్ గాలి బాలి తండ్రి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన శిబిరాన్ని విచారణ గురువు రెవ ఫాదర్ పీటర్ ప్రభాకర్, బిషప్ సెక్రటరీ రెవ ఫాదర్ చైతన్య, నేత్ర వైద్యులు గురు అభిలాష్, మదర్ కేథరిన్, చెన్నూరు గ్రామ పంచాయతీ సెక్రటరీ, రామ సుబ్బారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవదాసు మాట్లాడుతూ ప్రస్తుత రోజులలో సామాన్యమైన ప్రజలు వివిధ పనులలో పడి ఆరోగ్యాన్ని కంటి చూపును నిర్లక్ష్యం చేసుకుంటున్నారని, దానికి తోడు ఆర్థిక ఇబ్బందుల వల్ల సరైన సమయంలో వైద్యం చేసుకోలేక పోతున్నారని, అలాంటి వారికోసం శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. బిపి, షగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ముందులు, కళ్లజోళ్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపిఎస్‌ఎస్‌ఎస్ సంస్థ సిబ్బంది ఉపదేశి బాలస్వామి, శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ పాల్గొన్నారు.